




ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 252 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 +https:www.prajarepublic.com + వెల - 1/- ఆదివారం 13 ఏప్రిల్ 2025

RNI No: APTEL/2023/87888 Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# సర్కారు సన్న బియ్యం ఎఫెక్ట్..



## దిగొస్తున్న సన్న బియ్యం రేట్లు..

**తగ్గుముఖం పడుతున్న ధరలు..**

**క్వింటాల్కు రూ.400 నుంచి రూ.600 వరకు తగ్గిన రేట్లు...**

**ఇప్పటికే జిల్లాల్లో 98 శాతం సన్నబియ్యం పంపిణీ...**

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 13, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తిసుకున్న తెల్లరేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో మార్కెట్లో బియ్యం ధరలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. గత నెల వరకు ఫైన్ క్వాలిటీ రైస్ ధరలు క్వింటాల్ రూ.6,500 నుంచి రూ.5,800 వరకు పలికాయి. ఇప్పుడు క్వింటాల్ కు రూ.5 వేల లోపే ధర పలుకుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సన్న రకం వరి సాగును ప్రోత్సహించింది. సన్న వడ్లకు క్వింటాలు కు రూ.500 బోనస్ ప్రకటించింది. దీంతో అటు ప్రభుత్వం, ఇటు మిల్లర్లు పోటీపడి సన్న వడ్లు కొనుగోలు చేశారు. సప్లై పెరగడంతో వ్యాపారులు సన్న బియ్యం ధరలు తగ్గించారు.




గత బీఆర్ఎస్ పాలనలో తెల్ల రేషన్ కార్డుదారులకు దొడ్డు బియ్యం పంపిణీ చేయడంతో వాటిని తినలేక పేదలు మార్కెట్ లో అమ్ముకొని సన్న బియ్యం కొనుగోలు చేసేవారు. దీంతో సన్న బియ్యం ధరలు విపరీతంగా పెరిగాయి. గత ఉగాది పర్వదినం నాడు కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. మరోవైపు పంపిణీ చేసిన సన్న బియ్యం సైతం నాణ్యత ఉండడంతో ఎన్నడూలేని విధంగా లబ్ధిదారులు సన్న బియ్యం తీసుకునేందుకు రేషన్ షాపులకు ఎగబడ్డారు. ఇప్పటికే పెద్దపల్లి జిల్లాల్లో దాదాపు 98 శాతం వరకు 413 రేషన్ షాప్ ల ద్వారా పంపిణీ పూర్తయింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 29,28,549 మంది లబ్ధిదారులు రేషన్ కార్డు ఉన్న ఒక్కో లబ్ధిదారుడికి ప్రభుత్వం ఆరు కేజీల చొప్పున సన్న బియ్యం సరఫరా చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 29,28,549 మంది లబ్ధిదారులు ఉండగా, ప్రతినెలా 17,869 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేయనుంది. గతంలో దొడ్డు రకం బియ్యం పంపిణీ చేయడంతో వాటిని లబ్ధిదారులు రేషన్ డీలర్లకే అమ్ముకోవడంతో పెద్ద ఎత్తున రీ సైకిలింగ్ జరిగేవి. ప్రస్తుతం సన్న బియ్యం లబ్ధిదారులే వినియోగిస్తుండడంతో మార్కెట్ లో కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు.ప్రస్తుతం సన్న బియ్యానికి డిమాండ్ తగ్గడంతో క్వింటాల్ కొత్త బియ్యాన్ని రూ.5 వేల నుంచి రూ.6 వేల దాకా అమ్మారు. బీపీటీ సోనా రూ.5,400, ఆర్ఎన్ఆర్ రూ.5,400, హెచ్ఎంటీ రూ.5,600, జైశ్రీరాం రూ.5,500 దాకా విక్రయించారు. పాత బియ్యాన్ని రూ.5,800 నుంచి రూ.6,500 దాకా అమ్ముకున్నారు. గత నెలతో పోలిస్తే ప్రస్తుతం మార్కెట్లో కొత్త బియ్యం రకాన్ని బట్టి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తున్నాయి. ఈ నెలలో క్వింటాల్కు రూ.400 నుంచి రూ.600 వరకు ధరలు తగ్గుముఖం పట్టాయి. మధ్య తరగతి కుటుంబాలు ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అనకాపల్లి జిల్లాలోని బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం.. 8మంది మృతి

**కోటవురట్ల మండలం కైలాసపట్నంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది.**

అనకాపల్లి, ఏప్రిల్ 13, (రిపబ్లిక్ న్యూస్): అనకాపల్లి జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణసంచా తయారీ కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం సంభవించడంతో ఎనిమిది మంది మృతి చెందారు. ఈ ఘటనలో మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని సహాయకచర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుల్లో ఎక్కువమంది తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటకు చెందినవారు ఎక్కువమంది ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను విశాఖ కేజీహెచ్కు తరలించారు. మృతుల వివరాలు ఇవీ.. మృతి చెందిన వారిలో 1. అప్పికొండ తాతబాబు (50), 2. సంగరాతి గోవింద్ (45), 3. దాడి రామలక్ష్మి (38), 4. దేవర నిర్మల (36), 5. పురం పాప (40), 6. గుంపిన వేణుబాబు (40), 7. శానవెల్లి బాబురావు (56) 8. చదలవాడ మనోహర్ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వీరంతా బాణాసంచా తయారీ కేంద్రంలో కూలి పనికి వచ్చినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలిని అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్ పరిశీలించారు. క్షతగాత్రుల కుటుంబాలకు ధైర్యం చెప్పారు. సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఆయన.. క్షతగాత్రులను మెరుగైన చికిత్సకోసం కేజీహెచ్కు తరలించాలని ఆదేశించారు.





కోటవురట్ల మండల కేంద్రానికి మూడు కి.మీల దూరంలో ఈ విషాదం చోటుచేసుకుంది. తారాజువ్వల తయారీకి పేరొందిన ఈ కర్మాగారంలో బాణసంచా తయారు చేస్తున్న సమయంలో భారీ పేలుడు చోటుచేసుకుంది. ఈ పేలుడు ధాటికి నిర్మాణం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. క్షతగాత్రుల్లో ఒకరిద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఘటనా స్థలం వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పేలుడు సమయంలో పరిశ్రమలో 15మంది కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కలెక్టర్ విజయకృష్ణన్ విచారణకు ఆదేశించారు.

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన హోంమంత్రి అనిత

బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు ఘటనపై ఏపీ హోంమంత్రి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బందిని ఆమె అప్రమత్తం చేశారు. బాణసంచా పరిశ్రమ వద్దకు బయల్దేరిన ఆమె.. ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

### సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి

కోటవురట్ల మండలంలో విషాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హోంమంత్రి అనిత, కలెక్టర్, ఎస్పీలతో ఆయన ఫోన్లో మాట్లాడారు. బాధితుల ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని సీఎంకు అధికారులు వివరించారు. మరోవైపు, ఈ ఘటనపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని నర్సీపట్నం ఆర్డీవోను ఆదేశించారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిని ఆయన అప్రమత్తం చేశారు. బెడ్లు, వెంటిలేటర్లు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

### పవన్ తీవ్ర విచారం

కోటవురట్ల ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. హోంమంత్రి అనితతో ఫోన్లో మాట్లాడి ఈ ఘటనపై ఆరా తీశారు. పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

### బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి లోకేశ్

బాణసంచా పరిశ్రమలో అగ్నిప్రమాదం ఘటనపై మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మరణించడం దురదృష్టకరమన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలన్న ఆయన.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

# తితిదేపై వైకాపా నేత భూమన అసత్య ప్రచారం :హోంమంత్రి అనిత

**వైకాపా నేత భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారని హోంమంత్రి అనిత అన్నారు.**



అమరావతి, ఏప్రిల్ 13, (రిపబ్లిక్ న్యూస్): తితిదేపై వైకాపా నేత భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారని హోంమంత్రి అనిత అన్నారు. తిరుమల గోశాలలో ఆవులు చనిపోయాయంటూ ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అసత్య ప్రచారాలతో తితిదే ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. గోశాలలో 260 మంది సిబ్బంది గోసంరక్షణ పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. సుమారు 2,668 ఆవులకు జియోట్యాగ్ చేసి పర్యవేక్షిస్తున్నారని వివరించారు. “కరుణాకరరెడ్డి తితిదే ఖజానాను దారి మళ్లించి కమీషన్లు కొట్టేశారు. తిరుమల కొండపై అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహించింది ఆయనే. ఏడుకొండలను 5 కొండలుగా మార్చేందుకు భూమన కుట్ర చేశారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం” అని అనిత తెలిపారు.

# ‘భూభారతి’ కోసం వందేళ్లు ఉంటుంది:సీఎం రేవంత్

**వందేళ్ల పాటు వినియోగించుకునేందుకు వీలుగా భూభారతి వెబ్సైట్ ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

హైదరాబాద్, ఏప్రిల్ 13, (రిపబ్లిక్ న్యూస్): వందేళ్ల పాటు వినియోగించుకునేందుకు వీలుగా భూభారతి వెబ్సైట్ ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జూబ్లిహిల్స్లోని తన నివాసంలో భూభారతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్య రైతులకు సైతం అర్థమయ్యేలా భూభారతి వెబ్సైట్ ఉండాలన్నారు.



అత్యాధునికంగా రూపొందించాలని కోరారు. భద్రతాపరమైన సమస్యలు రాకుండా పకడ్బందీగా ఫైర్వాల్ ఉండాలన్న సీఎం.. భూభారతి నిర్వహణ బాధ్యతను విశ్వసనీయ సంస్థకు అప్పగిస్తే బాగుంటుందని తెలిపారు. భూభారతి పోర్టల్ను సోమవారం జాతికి అంకితం చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, రెవెన్యూ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్ సీసీఎల్ కార్యదర్శి మకరంద్ సహా పలువురు ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

### జూన్ 2 నాటికి భూభారతి అమలు:మంత్రి పొంగులేటి

ముందుగా మూడు మండలాల్లో పైలట్గా భూభారతి అమలు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. జూన్ 2 నాటికి రాష్ట్రవ్యాప్తంగా భూభారతి అమలు చేస్తామని తెలిపారు. శాసనసభ ఎన్నికలకు ఇది రెఫరెండం అవుతుందన్నారు. మే మొదటి వారంలో గ్రామపాలనాధికారులను నియమిస్తామని చెప్పారు.

# మంగళగిరి ప్రజల ప్రేమను ఎప్పటికీ మరిచిపోలేను:మంత్రి లోకేశ

**మంగళగిరిలో ఏడాదిలో 3 వేల మందికి ఇంటి పట్టాలు ఇచ్చినట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు.**

అమరావతి, ఏప్రిల్ 13, (రిపబ్లిక్ న్యూస్): మంగళగిరిలో ఏడాదిలో 3 వేల మందికి ఇంటి పట్టాలు ఇచ్చినట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ‘మన ఇల్లు- మన లోకేశ్ తొలి దశ చివరి రోజు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇక్కడి పేదలకు రూ.వెయ్యి కోట్ల విలువైన భూమి ఇచ్చినట్లు చెప్పారు. ఈ ప్రాంత ప్రజల ప్రేమను ఎప్పటికీ మరిచిపోలేనన్నారు. మంగళగిరి.. అన్ని రంగాల్లో ముందుండేలా చూసే బాధ్యత తనదని పేర్కొన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రి నిర్మిస్తామన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము సొంత నిధులతో 26 కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. “మంగళగిరి అభివృద్ధికి తీసుకొచ్చే జీవోలు రాష్ట్రమంతటికీ పనికొస్తున్నాయి. మంగళగిరి-తెనాలి మధ్య పీపీపీ మోడ్లో తొలి 4 లేన్ల రోడ్డు నిర్మించనున్నాం. ఇక్కడ కృష్ణా నది వెంట రూ.300 కోట్లతో రిటైనింగ్ వాల్ ఏర్పాటు చేయనున్నాం. త్వరలోనే మహానాడు కాలనీ రిటైనింగ్ వాల్ పనులు ప్రారంభిస్తాం. జూన్ నుంచి భూగర్భ డ్రైనేజ్, గ్యాస్, విద్యుత్ ప్రాజెక్టు పనులు చేపడతాం. ఇళ్ల పట్టాలకు రెండు వారాల్లో రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు రెండేళ్లలో



అమ్ముకునే హక్కు కల్పిస్తాం” అని లోకేశ్ తెలిపారు. మరోవైపు మంగళగిరిలో 100 పడకల ఆసుపత్రికి నారా లోకేశ్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేశ్ పాల్గొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు దీని నిర్మాణం చేపట్టారు. అత్యాధునిక వసతులతో ఏడాదిలోగా ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించారు. అనంతరం టిడ్కో నివాసాల వద్ద దివిస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సురక్షిత తాగునీటి పథకాన్ని లోకేశ్ ప్రారంభించారు.

### ప్రజలకు మేలు చేయాలనే తపనకు లోకేశ్ నిదర్శనం:మంత్రి అనగాని

పేదలకు ఇంటి పట్టాల పంపిణీని రాష్ట్రమంతటా అమలు చేస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. గెలిపించిన ప్రజలకు మేలు చేయాలనే తపనకు మంత్రి లోకేశ్ నిదర్శనమని చెప్పారు. కుప్పం, మంగళగిరి అభివృద్ధికి సీఎం చంద్రబాబు, లోకేశ్ పోటీ పడుతున్నారని పేర్కొన్నారు.

# మేరఠ్ హత్య కేసు.. నిందితురాలికి ప్రత్యేక సదుపాయాలు!

**మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్పుత్ హత్య కేసులో నిందితురాలు ముస్కాన్ రస్తోగికి జైల్లో ప్రత్యేక సదుపాయాలు కల్పించినట్లు సమాచారం.**



మేరఠ్, ఏప్రిల్ 13, (రిపబ్లిక్ న్యూస్): మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్పుత్ హత్య కేసులో ప్రస్తుతం జైల్లో ఉన్న నిందితురాలు, అతడి భార్య ముస్కాన్ రస్తోగిని జైల్లోని ప్రత్యేక ప్రసూతి సంరక్షణ గదిలోకి మార్చనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గర్భం దాల్చినందునే ఆమెను ప్రస్తుతం ఉన్న జైలు గది నుంచి తరలించనున్నట్లు తెలుస్తోంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఆమెతో పాటు గర్భంతో ఉన్న మరో మహిళా ఖైదీని కూడా తరలించనున్నారు. “గర్భిణీ ఖైదీల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్యారక్లోకి పంపుతాం. బిడ్డ జన్మించేంత వరకు వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షించేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు” అని జైలు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. కాగా.. మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్పుత్ను తన ప్రియుడితో కలిసి ముస్కాన్ రస్తోగి దారుణంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. నిందితులిద్దరు ప్రస్తుతం జైలులో ఉన్నారు. ముస్కాన్కు ఇటీవల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఆమె గర్భం దాల్చినట్లు తెలిసింది. ఆమె గర్భం దాల్చడంపై ఇటీవల బాధిత కుటుంబం స్పందించింది. ఒకవేళ బయోలాజికల్గా కడుపులోని బిడ్డ సౌరభ్కు చెందినది అయితే దత్తత తీసుకుంటామని.. ఆ బిడ్డను పెంచుకునేందుకు తమకు ఇష్టమేనని వెల్లడించింది.

# ఏపీలో ఎనిమిది మంది ఐఏఎస్ అధికారుల బదిలీ

**ఏపీలో ఎనిమిది మంది ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ బదిలీలకు సంబంధించి సీఎస్ విజయానంద్ ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు.**

అమరావతి, ఏప్రిల్ 13, (రిపబ్లిక్ న్యూస్): ఏపీలో ఎనిమిది మంది ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ బదిలీలకు సంబంధించి సీఎస్ విజయానంద్ ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రస్తుతం రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆర్పీ సిసోదియా.. చేనేత, జౌళి పరిశ్రమల మంత్రిత్వశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ అయ్యారు. అలాగే, సీసీఎస్ఏ, స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉన్న జయలక్ష్మికి రెవెన్యూశాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఐటీ కార్యదర్శి భాస్కర్ కాటమనేనికి ఏపీ హెచ్ఆర్డీఐ డైరెక్టర్ జనరల్గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే, పంచాయతీరాజ్, గ్రామాణాభివృద్ధిశాఖ కమిషనర్గా ముత్యాలరాజును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రైతు బజార్ల సీఈవోగా కె. మాధవీలత, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ సొసైటీ కార్యదర్శిగా గౌతమిబీ ఆయుష్ డైరెక్టర్గా దినేష్ కుమార్, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్గా నీలకంఠారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.




printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# ఏడాదిలో 15 బ్రాండ్స్

## వదులుకున్న సమంత.. కారణమేమిటంటే..?

గడిచిన ఏడాది కాలంలో నటి సమంత సుమారు 15 బ్రాండ్స్‌ను వదులుకున్నారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తెలియజేశారు.



సెల్ఫ్ లవ్, ఆరోగ్యం, ప్రశాంతతకు గత కొంతకాలంగా ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు నటి సమంత. నచ్చిన చిత్రాల్లో యాక్ట్ చేస్తూ తన అభిరుచులకు అనుగుణంగా ఆమె జీవిస్తున్నారు. వ్యక్తిగత సంరక్షణ, మహిళా సాధికారిత వంటి అంశాలను ఉద్దేశించి తరచూ ఇన్స్టా వేదికగా సందేశాలు ఇస్తున్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. మానసిక ఆరోగ్యం, వాణిజ్య ప్రకటనలు వంటి అంశాలపై ఆమె చర్చించారు. ఇందులో భాగంగా ఇటీవల తాను ఎన్నో బ్రాండ్స్ వదులుకున్నట్లు చెప్పారు. రూ. కోట్లు వస్తున్నప్పటికీ వాటిని పక్కన పెట్టడానికి ఒక బలమైన కారణం ఉందన్నారు. “20 ఏళ్ల వయసులో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టా. అప్పట్లో సక్సెస్కు నిర్వచనం చాలా విభిన్నంగా ఉండేది. మనం ఎన్ని ప్రాజెక్టు చేశాం, ఎన్ని బ్రాండ్స్కు ప్రకటనకర్తగా ఉన్నామనే దానిపైనే విజయాన్ని నిర్ణయించేవారు. ఆ సమయంలో ఎన్నో మల్టీనేషనల్ బ్రాండ్స్కు నేను బ్రాండ్ అంబాసిడర్గా వ్యవహరించా. అది నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. కానీ, ఇప్పుడు ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ఉత్పత్తులను ప్రమోట్ చేసేటప్పుడు ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని తెలుసుకున్నా. ఒకప్పుడు ఇష్టం వచ్చిన బ్రాండ్స్కు అంబాసిడర్గా ఉన్నందుకు నాకు నేనే క్షమాపణ చెబుతున్నా. కోట్లలో డబ్బు ఇస్తానని వచ్చినప్పటికీ గడిచిన ఏడాదిలోనే సుమారు 15 బ్రాండ్స్ వదులుకున్నా. ఇప్పటికీ నా వద్దకు ఎన్నో ఉత్పత్తులకు సంబంధించిన వాణిజ్య ప్రకటనల ఆఫర్స్ వస్తుంటాయి. కాకపోతే వాటిని నేను వెంటనే అంగీకరించను. ఆయా ఉత్పత్తులను మొదట నాకు తెలిసిన ముగ్గురు వైద్యులతో పరిశీలించి.. అవి సమాజానికి ఎలాంటి హాని చేయవని నిర్ణయించుకున్నాకే వాటిని చేస్తున్నా” అని సమంత వివరించారు. తాను మయోసైటిస్లో ఇబ్బందిపడుతున్నానని గత కొంతకాలం క్రితం సమంత తెలియజేశారు. చికిత్స తీసుకుంటూనే తాను సినిమా షూటింగ్స్లో పాల్గొన్న రోజులు ఉన్నాయని చెప్పారు. ‘సిటడెల్: హనీ బన్నీ’ తర్వాత ఆమె యాక్ట్ చేస్తోన్న తాజా ప్రాజెక్ట్ ‘రక్త బ్రహ్మాండ్. రాహి అనిల్ బార్వే దర్శకుడు. యాక్షన్ ఎంటర్టైనర్గా ఇది రూపొందనుంది. ‘మా ఇంటి బంగారం’ అనే సినిమా చేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ఆమె నిర్మాతగా వ్యవహరించిన ‘శుభం’ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది.

రిపబ్లిక్ సినిమా CINEMA

## ఈ పాన్ ఇండియా చిత్రాల కోసం
# రాజమౌళి వెయిటింగ్

ప్రముఖ దర్శకుడు రాజమౌళి ప్రస్తుతం జపాన్లో పర్యటిస్తోన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆయన అక్కడి మీడియాతో ముచ్చటించారు. తాను ఏయే చిత్రాల కోసం ఎదురుచూస్తున్నానో చెప్పారు.



‘ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్ డాక్యుమెంటరీ ప్రమోషన్స్ కోసం రాజమౌళి ఇటీవల జపాన్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. ప్రమోషన్స్‌లో భాగంగా ఆయన అక్కడి మీడియాతో ముచ్చటించారు. ‘ఆర్ఆర్ఆర్’ మూవీ చిత్రీకరణ ఎలా జరిగిందో తెలియజేస్తూ డాక్యుమెంటరీని సిద్ధం చేయడం ప్రత్యేకంగా అనిపించిందన్నారు. తమ చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పారు. “ఒక ప్రేక్షకుడిగా మీరు ఏయే చిత్రాలను చూసేందుకు ఎదురుచూస్తున్నారు?” అని ప్రశ్నించగా.. రాజమౌళి ఆసక్తికర సమాధానం చెప్పారు. ఎన్టీఆర్ – ప్రశాంత్నీల్ కాంబినేషన్లో రూపొందుతోన్న ‘డ్రాగన్’ (ప్రచారంలో ఉన్న టైటిల్), ప్రభాస్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్లో రానున్న ‘స్పిరిట్’ తోపాటు రామ్ చరణ్ నటిస్తోన్న ‘పెద్ది’ మూవీ కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమా గ్లింప్స్ ఇటీవల విడుదలైందని ఆయన అక్కడి వారికి తెలియజేశారు. ‘డ్రాగన్’ షూట్ దశలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ నెల 22 నుంచి ఎన్టీఆర్ రెగ్యులర్ షూట్లో పాల్గొననున్నారు. వచ్చే ఏడాది కానుకగా ఈ సినిమా విడుదల కానుంది. ‘స్పిరిట్కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. సందీప్ లొకేషన్స్ వేటలో పడ్డారు. ఇటీవల మెక్సికో వెళ్లి వచ్చారాయన. పవర్ఫుల్ పోలీస్ డ్రామాగా ఇది సిద్ధం కానుంది. రామ్చరణ్ ‘పెద్ద’ వేసవి కానుకగా వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈసినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఈ మూడూ పాన్ ఇండియా చిత్రాలే కావడం విశేషం. ‘ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్’ విషయానికొస్తే.. సుమారు 3 ఏళ్ల ఈ సినిమా ప్రయాణానికి సంబంధించి 20టీబీ ఫుటేజ్ రాగా దాన్ని ఎడిట్ చేసి.. బెస్ట్ మూమెంట్స్‌ను తీసుకుని 1:38 గంటల నిడివితో ఈ డాక్యుమెంటరీని రూపొందించారు. యాక్షన్ సీక్వెన్స్ షూటింగ్ విజువల్స్, చిత్రబృందం అభిప్రాయాలు తదితర సంగతులు ఇందులో చూపించారు. నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉంది. రాజమౌళి ప్రస్తుతం మహేశా బాబుతో సినిమా చేస్తున్నారు. ఎస్ఎస్ఎంబి 29గా ఇది ప్రచారంలో ఉంది.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1905 :** ఆంధ్ర బాలానంద సంఘం సంస్థాపకుడు, రేడియో అన్నయ్యగా సుపరిచితుడు న్యాయపతి రాఘవరావు జననం (మ.1984).
- **1914 :** ఆధ్యాత్మికవేత్త, బహుభాషా కోవిదుడు, వేదాంతభేరి వ్యవస్థాపకుడు విద్యా ప్రకాశానందగిరి స్వామి జననం (మ.1998) .
- **1919 :**పంజాబ్‌లోని జలియన్ వాలా బాగ్ నందు సమావేశమైన భారతీయ ఉద్యమకారులపై జనరల్ కాల్పులు జరిపాడు.
- **2007 :** సినిమా నటుడు ధూళిపాళ సీతారామశాస్త్రి మరణం (జ.1921).
- **2007 :** రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి మరణం (జ.1933).
- **1999 :** నాదస్వర విద్వాంసులు షేక్ చిన మౌలానా మరణం (జ.1924).

(చిత్రంలో)



న్యాయపతి రాఘవరావు


విద్యా ప్రకాశానందగిరి స్వామి


జలియన్ వాలా బాగ్


ధూళిపాళ సీతారామశాస్త్రి


వాసిరెడ్డి సీతాదేవి


షేక్ చిన మౌలానా

రిపబ్లిక్ స్పోర్ట్స్

# 141 పరుగులు చేసిన మా నాన్నను

## మెప్పించలేకపోయా: అభిషేక్ శర్మ

అభిషేక్ విశ్వరూపం చూపించాడు. భారీ శతకంతో ఎస్ఆర్హైచ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే, ఇది తన తండ్రిని మాత్రం మెప్పించిలేకపోయిందని వ్యాఖ్యానించడం గమనార్హం.





ఎట్టకేలకు అభిషేక్ శర్మ మళ్లీ ఫామ్లోకి వచ్చాడు. పంజాబ్లో ఉప్పల్ వేదికగా జరిగిన మ్యాచ్లో 141 పరుగులు చేసిన సన్రైజర్స్ హైదరాబాద్ను గెలిపించాడు. కానీ, ఈ ఇన్నింగ్స్ తన తండ్రి రాజ్ కుమార్ శర్మ ఆశించిన లక్ష్యాన్ని అందుకోలేదని అభిషేక్ శర్మ వెల్లడించాడు. ఐపీఎల్ చరిత్రలో లక్ష్య ఛేదనకు దిగిన తర్వాత అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్గా నిలిచాడు. ఇక ఓవరాల్గా మూడో ఐపీఎల్ అత్యధిక వ్యక్తిగత స్కోరు. మైదానంలో తన తల్లిదండ్రులు కూడా ఉన్నారు. ఆరెంజ్ ఆర్మీ, పేరెంట్స్ ముందు సంబరాలు చేసుకోవడం భలేగా అనిపించిందని అభిషేక్ తెలిపాడు. “ఇప్పుడీ మ్యాచ్ నాకెంతో స్పెషల్. అండర్- 14 రోజుల నుంచి నా ఆటను చూసేందుకు మా నాన్న మైదానాలకు వచ్చేవారు. ఇప్పుడు పంజాబ్కు నేను ఆడుతున్నప్పుడు మా నాన్నను దగ్గర నుంచి గమనిస్తే ఓ విషయం తెలుస్తుంది. ఏదో సైగలు చేస్తూ కనిపిస్తారు. నేను ఏ షాట్లు కొట్టాలో.. వద్దో చెబుతూ ఉండేవారు. ‘అలా కొట్టు.. ఇలా కొట్టు’ అని చెబుతూ కనిపించేవారు. ఆయనే నా తొలి కోచ్. ఇప్పుడు మా అమ్మానాన్న ముందు సెంచరీ చేయడం భలేగా ఉంది. ఐపీఎల్ లో ఇదే నా అత్యధిక స్కోరు. అయితే, మా నాన్నకు పెద్దగా అనిపించలేదు. నన్ను చివరి వరకూ క్రీజ్లో ఉండాలని ఆయన కోరుకున్నారు. ప్రతి విషయంలో ఇంప్రూవ్మెంట్ ఉంటుంది. అందుకోసం నేను నిరంతరం శ్రమిస్తూనే ఉంటా” అని అభిషేక్ వెల్లడించాడు.

### అభిషేకు అదే చెప్పా: రాజ్ కుమార్

“ఈ సంతోషాన్ని ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు. మ్యాచ్కు ముందు మేమిద్దరం మాట్లాడుకొనే సమయంలో ఒకటే చెప్పా. ఫామ్ గురించి ఆందోళన చెందొద్దని సూచించా. ప్రతి క్రికెటర్ కెరీర్లో ఇలాంటిది సహజమే. గత మ్యాచుల్లో అతడికి పెద్దగా ఏదీ కలిసిరాలేదు. రెండో మ్యాచ్లో రనౌట్గా పెవిలియన్కు చేరాడు. ఆ తర్వాత మ్యాచుల్లో షాట్లు కొట్టినా పరుగులు చేయలేకపోయాడు. ఈసారి మాత్రం ఆత్మవిశ్వాసంతో ఆడాడు. జట్టు కోసం విజయం అందించాడు. రాబోయే రోజుల్లో మరింత దూకుడుగా ఆడతాడు. మ్యాచ్కు ముందు ఎస్ఆర్హైచ్ విజయానికి తప్పకుండా పరుగులు చేస్తానని చెప్పాడు” అని రాజ్కుమార్ గుర్తు చేసుకున్నారు.

## ఆరోగ్యం

# ఆరు రకాల చేపలు ఆరోగ్యానికి చాలా ప్రమాదం, పాదరసం ఎక్కువ అస్సలు తినకండి

కొన్ని రకాల చేపల్ని తినకూడదు. ఇవి ఆరోగ్యానికి మేలు చేయకపోగా.. హాని చేస్తాయి. ఆ చేపలేంటి, వాటిని ఎందుకు తినకూడదో ఇక్కడ తెలుసుకుందాం.

చాలా మంది చేపల్ని ఇష్టంగా తింటారు. కొంతమందికి చేప లేనిదే ముద్దదిగదు. ఇక, ఆదివారం వచ్చిందంటే చాలు చాలా మంది చేపను ఓ పట్టు పడతారు. చేప పులుసు, చేప ఫ్రై, చేప బిర్యానీ ఇలా ఏ ఐటమ్ అయినా సరే తగ్గేదే లే అంటున్నారు. ఇక చేపలు తినడం వల్ల ఆరోగ్యానికి బోలెడు ప్రయోజనాలు ఉంటాయి. చేపల్లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ డి, విటమిన్ బి2, కాల్షియం, ఫాస్పరస్, ఐరన్, జింక్, అయోడిన్, ప్రోటీన్లు మెండుగా ఉంటాయి. అయితే, కొన్ని రకాల చేపల్ని తినకూడదు. ఇవి ఆరోగ్యానికి మేలు చేయకపోగా.. హాని చేస్తాయి. ఆ చేపలేంటి, వాటిని ఎందుకు తినకూడదో ఇక్కడ తెలుసుకుందాం.



### మాకేరెల్



మాకేరెల్ సాధారణంగా ఒమేగా-3లకు మంచి మూలం. వీటిలో ఆరోగ్యకరమైన ఆహారంగా డైలీ డైట్లో భాగం చేసుకోవచ్చు. కానీ పసిఫిక్ మహాసముద్రంలో ప్రత్యేకంగా కనిపించే కింగ్ మాకెరెల్, అధిక మొత్తంలో పాదరసం కలిగి ఉంటుంది. పిల్లలు, గర్భిణులు వీటికి పూర్తిగా దూరంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. వీటిని తినడం వల్ల కిడ్నీలు, నాడీ వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే వీటిని ఎక్కువ మోతాదులో తినకండి. తక్కువ మోతాదులో తింటే మంచిదంటున్నారు నిపుణులు.

### ట్యూనా



మాకేరెల్ లానే ట్యూన్ ఫిష్ కూడా పాదరసం యొక్క వివిధ స్థాయిలను కలిగి ఉంటుంది. ఉదాహరణకు, బ్లూఫిన్, బిగ్ ఐ ట్యూనా స్టిక్ వంటి చేపలకు దూరంగా ఉండటం ఉత్తమం. అల్బాకోర్ ట్యూనాలో ఒమేగా-3లు ఎక్కువగా ఉంటాయి, అయితే మీరు దీన్ని వారానికి ఒకసారి కంటే ఎక్కువ తినకూడదు. ఈ విషయం ఎల్లోఫిన్‌కు కూడా వర్తిస్తుంది. క్యాన్డ్ లైట్ ట్యూనా ప్రోటీన్ యొక్క మంచి. అయితే దీనిని వారానికి రెండు సార్లు మించి తినకూడదు. ఎక్కువ తింటే మెదడు పనితీరు, నరాల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అంతేకాకుండా వీటిని కొన్నిసార్లు హార్మోన్లు, యాంటీ బయోటిక్స్‌తో ఇంజెక్ట్ చేస్తారు. ఇవి ఆరోగ్యానికి హానికరం.

### తిలాపియా



అధిక గిరాకీ కారణంగా, తిలాపియా చేపల్ని విస్తృతంగా సాగు చేస్తున్నారు. ఇవి మార్కెట్లలో ఎక్కువగా లభిస్తుంటాయి. అయితే డిమాండ్ కారణంగా ఈ చేపలకు వాణిజ్య మేత లేదా కోడి వ్యర్థాలను అందిస్తారు. ఇవి ఆరోగ్యానికి మంచివి కావు. పెద్ద మొత్తంలో తిలాపియా తీసుకోవడం వల్ల గుండెపోటు, స్ట్రోక్, ఆస్తమా వంటి ప్రమాదాల్ని పెంచుతుందని నివేదికలు సూచిస్తున్నాయి. తిలాపియాలో ప్రోటీన్ స్థాయిలు తక్కువగా ఉంటాయి. డైబ్యూటిల్టిన్ అనే రసాయనాన్ని కలిగి ఉంటుంది. ఇది కొందరిలో ఉబ్బసం, అలెర్జీలను ప్రేరేపిస్తుంది. అందుకే ఇలాంటి చేపల్ని ఎక్కువగా తినకండి.

### బసా చేప



బసా చేప అనేది క్యాట్ ఫిష్ రకం. చాలా రెస్టారెంట్లలో వీటిని చేపల కూరలకు ప్రత్యామ్నాయంగా ఉపయోగిస్తున్నారు. అయితే బసా ఫిష్‌లో కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచే హానికరమైన కొవ్వు ఆమ్లాలు ఉన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. శ్వాసకోశ సమస్యలు లేదా ఆర్థరైటిస్ ఉన్నవారు ఈ చేపకు దూరంగా ఉండాలి.

### సార్డిన్



ట్యూనా, మాకేరెల్ మాదిరిగానే, సార్డినెస్ సముద్రపు చేపలు. ఇవి అధిక మొత్తంలో పాదరసం కలిగి ఉంటాయి. ఇవి గణనీయమైన ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తాయి. వీటిని ఎక్కువ తింటే మెదడు ఆరోగ్యం దెబ్బ తినే ప్రమాదముంది. చిన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలు ఈ రకం చేపలకు దూరంగా ఉండాలి. నరాల ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.

### క్యాట్ ఫిష్



ఇవి నీటిలో డైరెక్ట్‌గా దొరికి తింటే వేరు. అయితే మార్కెట్లో దొరికే క్యాట్ ఫిష్‌లు కొనేటప్పుడు జాగ్రత్త. ఇవి తరచుగా హార్మోన్లతో ఇంజెక్ట్ చేయబడతాయి, వీటిని తీసుకోవడం హానికరం. మార్కెట్ నుంచి పెద్ద సైజులో ఉన్న క్యాట్ ఫిష్ కొనుగోలు చేయకుండా ఉండటం మంచిది. వాటికి బదులు చిన్న సైజులో ఉన్న క్యాట్ ఫిష్‌లు బెస్ట్ ఆప్షన్. ఎందుకంటే ఇవి సన్నగా ఉండటం వల్ల ఆరోగ్యానికి సురక్షితమైనవి.

### తినాల్సిన చేపలు

- సాల్మన్ చేప
- హిల్సా చేప
- ఇంగువ చేపలు లేదా ఆంకోవి
- ట్రౌట్ చేపలు
- ఈ చేపల్లో ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా లభిస్తాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. స్ట్రోక్, అల్జీమర్స్ వంటి వ్యాధుల ముప్పును తగ్గిస్తాయి. అందుకే డైట్‌లో ఇలాంటి చేపల్ని భాగం చేసుకోండి.

**గమనిక**

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.